సాక్షి
కామారెడ్డి
బుధవారం । 24 । ఏప్రిల్ । 2024



**భారీ మెజారిటీతో గెలిపించాలి**
కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ప్రజలను కోరారు.
- 9లో ▸



**సమయస్ఫూర్తితో..**
విద్యుత్ ప్రమాదాలు జరిగినప్పుడు సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రాథమిక చికిత్స అందించాలని వైద్యులు సూచించారు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
42.2 /20.8

**వాతావరణం**
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

## న్యూస్‌రీల్

### ఒకటో తేదీ నుంచి రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ బియ్యం పంపిణీ మే ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఒక్కో యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేయనున్నారు. అంత్యోదయ కార్డులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డులకు 10 కిలోల చొప్పున అందిస్తారు. ఒకటో తేదీ నుంచి 15వ తేదీవరకు మాత్రమే బియ్యం పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు.

### నేటి నుంచి వేసవి సెలవులు

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలకు వేసవి సెలవులను ప్రకటించినట్లు డీఈవో రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి జూన్ 11వ తేదీవరకు సెలవులు ఉంటాయని పేర్కొన్నారు. 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని తెలిపారు. వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి లేని పాఠశాలల్లో పిల్లలను చేర్పించవద్దని తల్లిదండ్రులకు సూచించారు. అనుమతులు ఉన్న పాఠశాలల వివరాలు ఎంఈవోల వద్ద అందుబాటులో ఉంటాయని తెలిపారు.

### జహీరాబాద్ బీఎస్పీ అభ్యర్థిగా బాల్‌రాజు



కామారెడ్డి అర్బన్: జహీరాబాద్ పార్లమెంట్ బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిగా బట్టింకి బాల్‌రాజును పార్టీ మంగళవారం ప్రకటించింది. పాల్వంచ మండలం ఫరీదుపేటకు చెందిన బాల్‌రాజు గతంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. తనకు అవకాశం ఇచ్చిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్, సెంట్రల్ స్టేట్ కోఆర్డినేటర్ ఎం.బాలయ్యలకు బాల్‌రాజు ధన్యవాదాలు తెలిపారు.

### 'విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలి'



కామారెడ్డి రూరల్: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రాజు సూచించారు. దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డీఈవో చేతులమీదుగా ప్రోత్సాహక బహుమతులు, ప్రగతి పత్రాలను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాకిషన్, ఉపాధ్యాయులు జంగం శ్రీశైలం, సహేందర్, శ్రీనివాస్, సునీత, మీన, కరుణ, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

### పుస్తక పఠనంతో విజ్ఞానం

సుభాష్‌నగర్: పుస్తక పఠనంతో అపారమైన జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చని నిజామాబాద్ ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో నాగభూషణం వందే పేర్కొన్నారు. నగరంలోని స్నేహ సొసైటీలో మంగళవారం ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. బ్యాంకు జనరల్ మేనేజర్లు సూర్యప్రకాశ్, ఫణి శ్రీరామ్, కంఠేశ్వర్ బ్రాంచ్ మేనేజర్ శ్వేత చంద్రిక పాల్గొన్నారు.

# ప్రచార హోరు

ఎన్నికల గడువు సమీపిస్తున్న కొద్దీ ప్రచారం ఊపందుకుంటోంది. ఆయా పార్టీల నాయకులు, అభ్యర్థులు ఊళ్లను చుట్టేస్తున్నారు. గెలిపిస్తే చేయబోయే అభివృద్ధిని వివరిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. స్టార్ క్యాంపెయినర్లూ రంగంలోకి దిగుతుండడంతో రాజకీయం మరింత వేడెక్కుతోంది.

- స్పీడు పెంచిన అభ్యర్థులు
- ఊళ్లను చుట్టేస్తున్న నేతలు
- పెరుగుతున్న రాజకీయ వేడి



సాక్షి, కామారెడ్డి: పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రధాన పార్టీలు.. గెలుపుకోసం సర్వశక్తులను ఒడ్డుతున్నాయి. జహీరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్, బీజేపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్ బరిలో నిలవగా.. అభ్యర్థులతోపాటు వారి తరఫున ఆయా పార్టీల ముఖ్యనేతలూ ఊరూరా తిరుగుతున్నారు. అసెంబ్లీ నియోజకవర్గంలో మెజారిటీ ఓట్లు సాధించడం ద్వారా సత్తా చాటుకోవాలని ఆయా నాయకులు ఆరాటపడుతున్నారు.

**సవాల్‌గా తీసుకున్న కాంగ్రెస్ నేతలు**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నేతలకు పార్లమెంట్ ఎన్నికలు సవాలుగా మారాయి. తమ పార్టీ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు తీసుకురావడం ద్వారా పలుకుబడి పెంచుకోవాలని ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, నేతలు ఆరాటపడుతున్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ విస్తృతంగా పర్యటిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థికి మెజారిటీ తీసుకురావాలన్న లక్ష్యంతో పావులు కదుపుతున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహించి, వారిని ఎన్నికలకు సన్నద్ధం చేశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సైతం నియోజకవర్గం అంతటా చుట్టేస్తున్నారు. నిత్యం జనం మధ్యలోనే ఉంటూ ప్రచారం చేస్తున్నారు. బాన్సువాడలో మకాం వేసిన మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ తీసుకురావడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా బీఆర్‌ఎస్‌కు చెందిన నాయకులు పలువురిని తనవైపు లాగడంలో విజయవంతమయ్యారు. జుక్కల్‌లో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సైతం విస్తృతంగా పర్యటిస్తూ కాంగ్రెస్ అభ్యర్థి కోసం శ్రమిస్తున్నారు.

అబ్‌కీ బార్ చార్‌సౌ పార్ నినాదంతో ఎన్నికల బరిలో దిగిన బీజేపీ.. జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల కదనరంగంలో నూతనోత్సాహంతో ముందుకు సాగుతోంది. కామారెడ్డిలో కేసీఆర్, రేవంత్‌రెడ్డిలాంటి ఉద్దండులను ఓడించిన వెంకటరమణారెడ్డి నాయకత్వంలో పార్టీ శ్రేణులు జోష్‌తో

**ఉత్సాహంతో కమలదళం..**

ప్రచారంలో పాల్గొంటున్నాయి. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వం, అయోధ్యలో రామాలయ నిర్మాణం వంటి అంశాలు కలిసి వస్తాయని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ నియోజకవర్గం మొత్తాన్ని చుట్టేస్తుండగా.. కామారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం సాగుతోంది. ఎల్లారెడ్డిలో పార్టీ నేతలు బాణాల లక్ష్మారెడ్డి, పైడి ఎల్లారెడ్డి, సుభాష్‌రెడ్డిల అనుచరులు ఎన్నికల ప్రచారంలో హుషారుగా పాల్గొంటున్నారు. బాన్సువాడలో మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో, జుక్కల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యేలు అరుణతార, గంగారాం, పండరి తదితరుల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం కొనసాగుతోంది.

**హ్యాట్రిక్ కోసం బీఆర్‌ఎస్ ఆరాటం**

రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయిన బీఆర్‌ఎస్.. పార్లమెంట్ ఎన్నికలలో గెలిచి జిల్లాపై పట్టు నిలుపుకోవాలని యోచిస్తోంది. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ బాన్సువాడలో విజయం సాధించగా, జుక్కల్‌లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందింది. కామారెడ్డిలో అప్పటి సీఎం కేసీఆర్ నిలబడినా ఓడిపోయారు. ఎల్లారెడ్డిలో బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పలేదు. అయితే తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత వరుసగా రెండుసార్లు జహీరాబాద్ లోక్‌సభ స్థానాన్ని గెలుచుకున్న గులాబీ దళం.. ఈసారీ గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని ప్రయత్నిస్తోంది. అధికార పార్టీపై వ్యతిరేకత మొదలైందని, అది తమకు అనుకూలిస్తుందని బీఆర్‌ఎస్ నేతలు ఆశిస్తున్నారు. బాన్సువాడలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పార్టీ అభ్యర్థి గెలుపు బాధ్యతలను భుజాలపైకెత్తుకొనగా.. కామారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, ఎల్లారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, జుక్కల్‌లో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధేలు ప్రచార బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

**స్టార్ క్యాంపెయినర్ల ప్రచారం..**

అభ్యర్థులకు మద్దతుగా ఆయా పార్టీల స్టార్ క్యాంపెయినర్లు జిల్లాలో పర్యటించనున్నారు. బీజేపీ ఈనెల 25న బాన్సువాడలో నిర్వహించే సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పాల్గొననున్నారు. అలాగే పలువురు జాతీయ స్థాయి నేతలు, రాష్ట్ర నాయకులు సైతం బీబీ పాటిల్‌కు మద్దతుగా ప్రచారానికి రానున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థికి మద్దతుగా ఆ పార్టీ అధినేత కేసీఆర్ జిల్లాకు రానున్నారు. ఆయన వచ్చే నెల 7న కామారెడ్డిలో రోడ్‌షో నిర్వహిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. అలాగే హరీశ్‌రావు, కేటీఆర్‌లు కూడా ప్రచారంలో పాల్గొననున్నారు. కాంగ్రెస్ కూడా జాతీయ స్థాయి నేతలతోపాటు పలువురు రాష్ట్ర స్థాయి నేతలతో ప్రచారం నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఆయా నేతల సభలు, రోడ్ షోలతో ప్రచారం మరింత జోరందుకోనుంది.

# జై బోలో హనుమాన్‌కీ..



జిల్లా కేంద్రంలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

- జిల్లాలో ఘనంగా హనుమాన్ జయంతి
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ



సలాబత్‌పూర్‌లో హారతి ఇస్తున్న ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

కామారెడ్డి టౌన్: జిల్లాలో మంగళవారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయంనుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జిల్లా కేంద్రంలో బజరంగ్‌దళ్, వీహెచ్‌పీల ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. కోడూరి హనుమాన్ దేవాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పుర వీధుల గుండా సాగింది. శోభాయాత్రలో సీత, శ్రీరాముడు, లక్ష్మణుడు, ఆంజనేయ స్వామి వేషధారణతో చిన్నారులు అలరించారు.



సలాబత్‌పూర్‌లోని హనుమాన్ ఆలయంలో భక్తుల రద్దీ

## 'కొనుగోళ్లను వేగవంతం చేయాలి'



నిర్వాహకులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

మాచారెడ్డి: ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పాల్వంచ మండలంలోని ఎల్పుగొండ, వాడి గ్రామాల్లో ఆయన పర్యటించి, కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం తూకం వేసిన వెంటనే జాప్యం చేయకుండా సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మంచినీరు అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ధాన్యం తడవకుండా అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం కుప్పలపై టార్పాలిన్ కప్పి ఉంచాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ నిత్యానందం తదితరులు పాల్గొన్నారు.

## రసవత్తరంగా కుస్తీ పోటీలు



కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు

రుద్రూర్: మండలంలోని అంబం(ఆర్) గ్రామంలో మంగళవారం నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా కొనసాగాయి. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది హన్మాన్ జయంతి సందర్భంగా కుస్తీ పోటీలు నిర్వహిస్తారు. కుస్తీ పోటీలో వివిధ ప్రాంతాల నుంచి కుస్తీ వీరులు తరలివచ్చారు. విజేతలకు నగదు బహుమతి అందజేశారు. వీడీసీ ప్రతినిధులు శానం పోశెట్టి, కమ్మరి రవి, పట్టెపు రాములు, ఎంజీఆర్, ఆత్మూరి మహేష్, తాహెర్, హన్మాండ్లు, నర్సయ్య పాల్గొన్నారు. అలాగే కోటగిరి మండల కేంద్రంతోపాటు, పోతంగల్ మండలం కొల్లూర్ గ్రామంలో కుస్తీ పోటీలు ఏర్పాటు చేశారు. పోటీలకు సమీప గ్రామాల నుంచి కుస్తీ వీరులు తరలివచ్చారు. గెలుపు కోసం హోరాహోరీగా తలపడ్డారు. కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# నిజాయితీగా ఓటేయాలి



ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్



ట్రాన్స్‌జెండర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: అర్హులందరూ ఓటు హక్కును నిజాయితీగా వినియోగించుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కామారెడ్డి డిగ్రీ కళాశాల ఆవరణలోని రాశి వనంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలన్నారు. అనంతరం ఓటర్ సెల్ఫీ పాయింట్ వద్ద అధికారులు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో కలెక్టర్ సెల్ఫీ దిగారు. తప్పనిసరిగా ఓటు వేస్తామని ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి వెంకటేశ్, అధికారులు రాజారాం, వరదారెడ్డి, వెంకట్‌రెడ్డి, సాయిలు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు లింగం, బాలయ్య, శంకర్, రాజ్‌గంభీర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం**

ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు కీలకమని, రాజ్యాంగం తమకు కల్పించిన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. మంగళవారం స్వీప్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్స్‌తో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సుమారు 30 మందికి ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు కలిగి ఉన్నారన్నారు. ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వెంటనే ఓటరు హెల్ప్‌లైన్‌ను సంప్రదించి ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. గురువారం ఓటరు తుది జాబితా విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బావయ్య, స్వీప్ నోడల్ అధికారి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

**తప్పుడు, చెల్లింపుల వార్తలను గుర్తించాలి**

కామారెడ్డి క్రైం: పత్రికలు, చానళ్లలో వచ్చే తప్పుడు, చెల్లింపుల వార్తలను గుర్తించాలని సిబ్బందికి కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ కంట్రోల్ రూమ్‌ను తనిఖీ చేశారు. 1950 నంబర్‌కు 493 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని తక్షణమే పరిష్కరించామని సిబ్బంది తెలిపారు. సి-విజిల్ యాప్‌కు 40 ఫిర్యాదులు వచ్చాయని, ఇందులో 30 ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించామని వివరించారు. పది ఫిర్యాదులను తిరస్కరించామన్నారు. కార్యక్రమంలో ఎంసీఎంసీ నోడల్ అధికారి మురళీకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

# ఐదో రోజు మూడు నామినేషన్లు



నిజామాబాద్‌లో నామినేషన్ వేస్తున్న బీబీ నాయక్




బీబీ పాటిల్ తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ నాయకులు

కామారెడ్డి క్రైం: జహీరాబాద్ నియోజకవర్గంలో మంగళవారం ఐదో రోజు మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ తరఫున ఆ పార్టీ నాయకులు ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి క్రాంతి వల్లూరుకు అందజేశారు. అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థిగా చావగాని మణి, ఇండియా ప్రజాబంధు పార్టీ అభ్యర్థిగా బాబు దుర్గయ్య ఒక్కో సెట్ చొప్పున నామినేషన్‌లు దాఖలు చేశారు.

**నిజామాబాద్‌లో 16 నామినేషన్లు**

సుభాష్‌నగర్(నిజామాబాద్ అర్బన్): నిజామాబాద్ స్థానంలో మంగళవారం 16 నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి, నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. బహుజన్ లెఫ్ట్ పార్టీ అభ్యర్థిగా అశోక్‌గౌడ్ అబ్బగోని, ఆలిండియా బీసీ ఓబీసీ పార్టీ అభ్యర్థిగా పోతు నవీన్, ప్రజాసేన పార్టీ అభ్యర్థిగా పోతు నాగార్జున్, ఆలిండియా నేషనల్ పార్టీ అభ్యర్థిగా ఎండీ షాహెద్ ఖాన్, దళిత బహుజన పార్టీ అభ్యర్థిగా గోలి నరేశ్ నామినేషన్లు వేశారన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా కొత్తకొండ శక్తిప్రసాద్, బీబీ నాయక్, మహమ్మద్ జమీల్, జి.సాయికృష్ణ మూర్తి నామినేషన్ వేశారన్నారు. ఇప్పటికే స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన రాపెల్లి సత్యనారాయణ రెండో సెట్, రాపెల్లి శ్రీనివాస్ మూడోసెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారని తెలిపారు. ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా కందెల సుమన్ కూడా మూడో సెట్ నామినేషన్ దాఖలు చేశారన్నారు. వీరితోపాటు అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థిగా యుగంధర్ గట్ల, యుగ తులసి పార్టీ అభ్యర్థిగా కోటగిరి శ్రీనివాస్, విద్యార్థులు రాజకీయ పార్టీ అభ్యర్థిగా భూక్య నందు మూడోసెట్, స్వతంత్ర అభ్యర్థిగా కాట్రాజి ప్రశాంత్ రెండోసెట్ నామినేషన్లు వేశారని వివరించారు.

# హిందూ ధర్మాన్ని రక్షించుకోవాలి



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ శివకుమార్

నిజామాబాద్‌అర్బన్: హిందూ ధర్మాన్ని సంరక్షించుకునే బాధ్యత మనపై ఉందని ఆర్‌ఎస్‌ఎస్ ఇందూరు విభాగ్ ప్రచారక్, తెలంగాణ ప్రాంత సహబౌద్ధిక్ ప్రముఖ్ నర్రా వెంకటశివకుమార్ పేర్కొన్నారు. నగరంలో హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన విజయయాత్ర ఘనంగా కొనసాగింది. రాజరాజేంద్ర చౌరస్తాలో ఏర్పాటు చేసిన యాత్ర ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హిందూవులు సంఘటితంగా నిలబడితే ప్రపంచం కూడా ఏమీ చేయలేదన్నారు. హిందూ ధర్మం కోసం హిందువులందరూ వంద శాతం ఓటు హక్కును వినియోగించుకొని తమ సత్తా చాటాలన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ మన పండుగలను అంగరంగ వైభవంగా నిర్వహించుకోవాలన్నారు. ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ కామన్ సివిల్ కోడ్ ఉండాలని అంబేడ్కర్ ఆనాడే సూచించారన్నారు. ఆయన సూచనను అమలు చేసేందుకు బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం గట్టి నిర్ణయం తీసుకుందన్నారు. దీనికోసం ప్రతి ఒక్కరూ ఓటు వేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఘనంగా స్కూల్ వార్షికోత్సవం



కామారెడ్డి టౌన్: పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ హై స్కూల్ వార్షికోత్సవ వేడుకలను ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్పీ సింధు శర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, ప్రోకబడ్డీ తెలుగు టైటాన్స్ ప్లేయర్ సిద్ధార్థ దేశాయ్ హాజరయ్యారు. అనంతరం ముఖ్య అతిథులను పాఠశాల యజమాన్యం ఘనంగా సన్మానించింది. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

### శారదామాత ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తా



కామారెడ్డి అర్బన్: శ్రీశారదామాత ఆదిశంకర ఆలయ అభివృద్ధికి తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. పౌర్ణమి సందర్భంగా ఆలయంలో మంగళవారం శ్రీనవ దుర్గ మాత సామూహిక వ్రతం నిర్వహించగా చైర్‌పర్సన్ హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో వేదపండితులు జి.ఆంజనేయశర్మ, అర్చకులు సతీశ్‌పాండే, ఆలయ కమిటీ అధ్యక్షుడు కె మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

### బాలుకు ఉత్తమ సామాజిక సేవా పురస్కారం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రక్తదాతల సమూహం వ్యవస్థాపకుడు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు చేస్తున్న సేవలకు హైదరాబాద్‌కు చెందిన తలసేమియా సికిల్ సెల్ సొసైటీ ఉత్తమ సామాజిక సేవా పురస్కారం అందజేసింది. తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం సంవత్సర కాలంలో 22 రక్తదాన శిబిరాల ద్వారా 2306 యూనిట్ల రక్తం సేకరించినందుకు గాను బాలుకు ఉత్తమ సామాజిక సేవా పురస్కారం అందజేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పర్లపల్లి రవీందర్, తలసేమియా సికిల్ సెల్ సొసైటీ నిర్వాహకులు వంశీ తదితరులు పాల్గొన్నారు.

### కాద్లాపూర్‌లో సప్తాహం

బాన్సువాడ రూరల్: మండలంలోని కాద్లాపూర్‌లో సప్తాహం కార్యక్రమాన్ని గ్రామస్తులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. మహారాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయాలు ఎక్కువగా పాటించే ఈ గ్రామస్తులు సప్తాహం ముగింపు సందర్భంగా గ్రామంలో దిండి ఊరేగింపు, నిండుసర్వలు, భజన కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్: జిల్లాలోని కేజీబీవీ పాఠశాలలో సెప్టిక్ ట్యాంక్‌ను క్లీన్ చేయడానికి సంబంధిత ఏజెన్సీల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు డీఈవో రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27వ తేదీ లోగా కలెక్టరేట్‌లోని విద్యాశాఖ అధికారి కార్యాలయం రూమ్ నంబర్ 223లో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.



నగరంలో మంగళవారం వీరహనుమాన్ విజయయాత్రను ఘనంగా నిర్వహించారు. జై శ్రీరాం, జై హనుమాన్ నినాదాలతో నగరం మారోమ్రోగింది.

### విశ్వాసానికి ప్రతీక ఆంజనేయస్వామి



శోభాయాత్రలో పాల్గొన్న జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: విశ్వాసానికి, భక్తికి ఆంజనేయ స్వామి ప్రతీక అని, హనుమాన్ పూజతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన నగరంలో నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొన్నారు. నగరంలోని దాసాంజనేయ, నీలకంఠేశ్వర, ప్రసన్నాంజనేయ, మార్కండేయ, గోల్ హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లోకానికి ఆదర్శ మూర్తి శ్రీరామ చంద్రుడని, శ్రీరాముడి భక్తుడు ఆంజనేయ స్వామి జయంతి హిందువుల ఇంట సుఖసంతోషాలు నింపాలని కోరుకుంటున్నానని అన్నారు.

### రామరాజ్య స్థాపన అయినట్లు ఉంది



శోభాయాత్రలో నృత్యం చేస్తున్న ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్‌అర్బన్: దేశ వ్యాప్తంగా రామరాజ్యం స్థాపన పూర్తయినట్లు అనిపిస్తోందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. నగరంలో హనుమాన్ శోభాయాత్ర ప్రారంభం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నో ఏళ్ల కల అయిన అయోధ్యలో శ్రీరామమందిరం పూర్తికావడం, ఇంకా మరెన్నో కార్యక్రమాలు పూర్తి కావడం చూస్తే రామరాజ్యం వచ్చినట్లు ఉందన్నారు. ముందు కూడా దేశంలో రామరాజ్య స్థాపనకు కృషి చేస్తున్న సంస్థలకు అందరూ సహకారం అందించాలని కోరారు. యాత్రలో అర్వింద్‌తోపాటు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యానారాయణ నృత్యం చేశారు.

# జీవితం 'పరీక్ష' కాదు



ప్రశాంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కల్పన (ఫైల్)

సిరికొండ: జీవితమంటే 'పరీక్ష' కాదని.. ఒకసారి ఫెయిల్ అయినంత మాత్రానా జీవితం ముగిసిపోదని నిరూపించారు కల్పన. పరీక్షల్లో ఫెయిల్ కాగానే తీవ్ర ఒత్తిడికి లోనయ్యే వారికి, ఆత్మహత్యాయత్నాలకు పాల్పడే వారి ఆలోచలను ఆమె జీవితం మార్చేస్తుంది. మరోసారి ప్రయత్నిద్దామని ముందుకు వెళ్లేవారికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

సిరికొండ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు కల్పన.. మోర్తాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో (2002–04) విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఇంగ్లిష్ సబ్జెక్టులో ఫెయిల్ అయ్యారు. అయినప్పటికీ ఆమె ఆత్మవిశ్వాసం దెబ్బతినలేదు. కష్టపడి చదివి సప్లిమెంటరీలో 60 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. అలా ఉన్నత చదువుల్లో రాణించి 2012 డీఎస్సీలో ఒకేసారి రెండు ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించారు. జిల్లాలోనే అతి చిన్న వయసులో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలిగా ఎంపికై సిరికొండ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు గాను రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులను అప్పటి మంత్రి ప్రశాంత్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డులు అందుకున్నారు.

### నిరాశ చెందొద్దు



పరీక్షల్లో ఫెయిల్ అయినా, తక్కువ మార్కులొచ్చినా నిరాశ చెందొద్దు. తమను తాము తక్కువగా అంచనా వేసుకోవద్దు. ఓటమిని చాలెంజ్‌గా తీసుకొని మరో ప్రయత్నం చేసేందుకు ముందుకు సాగాలి. కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదు. మార్కులు ఒక్కటే జీవితం కాదు. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ ఉంటుందని మరువొద్దు.

– కల్పన, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు

## క్రైం కార్నర్

# గుండెపోటుతో సీనియర్ నాయకుడి మృతి

- నివాళులు అర్పించిన ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి

బోధన్‌రూరల్(బోధన్): బోధన్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు, బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి భర్త బుద్దె రాజేశ్వర్(53) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. బోధన్, బాన్సువాడ ఎమ్మెల్యేలు పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డితోపాటు జిల్లా, నాయకులు, ప్రముఖులు రాజేశ్వర్ మృతదేహానికి నివాళులు అర్పించారు. మంగళవా రం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించగా పెద్దసంఖ్యలో జనం పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

**అంచెలంచెలుగా ఎదిగిన నాయకుడు**

సాలూర మండల కేంద్రానికి చెందిన బుద్దె రాజేశ్వర్ రాజకీయాల్లో అంచెలెంచలుగా ఎదిగి నియోజకవర్గంలో కీలకనాయకుడిగా గుర్తింపు పొందారు. తన 30ఏళ్ల రాజకీయ జీవితంలో సాలూర గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఎంపీటీసీ పదవికి రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమ సమయంలో కీలకంగా వ్యవహరించారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఆయన సతీమణి బుద్దె సావిత్రి విజయం సాధించి బోధన్ ఎంపీపీగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ఆయన బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రాజేశ్వర్‌కు ముగ్గురు కూతుళ్లు సంధ్య, సవిత, రూప ఉన్నారు.



బుద్దె రాజేశ్వర్ (ఫైల్)

### సలాబత్‌పూర్‌లో ప్రత్యేక పూజలు



మద్నూర్(జుక్కల్): మూడు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయం భక్తులతో ఆలయం కిటకిటలాడింది. హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ పూజలు చేపట్టారు. ఆలయానికి కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మరాఠీ, తెలుగు, హిందీ భాషలలో భజనలు, కీర్తనలు కొనసాగాయి. భక్తులకు అన్నదానం నిర్వహించారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు. బుధవారం జాతర, కుస్తీ పోటీలను నిర్వహించనున్నారు.

### పిల్లల రక్షణపై శ్రద్ధ చూపాలి

బాన్సువాడ రూరల్: వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు తమ పిల్లల రక్షణపై శ్రద్ధ చూపాలని బోర్లం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం వెంకటరమణ అన్నారు. పాఠశాలలో మంగళవారం విద్యార్థుల తల్లితండ్రులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు ప్రొగ్రెస్ కార్డులను పంపిణీ చేశారు. మండలంలోని సోమేశ్వర్, దేశాయిపేట్, ఇబ్రహీంపేట్, హన్మాజీపేట్, కొత్తాబాది, తాడ్కోల్, పలు గ్రామాల్లో ఆయా పాఠశాలలు తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి విద్యార్థుల ప్రగతిపై చర్చించారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఆటోనగర్‌లో గంజాయి పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని ఆటోనగర్‌లో 1.25కేజీల గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో దిలీప్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆటోనగర్‌కు చెందిన షకీలా బీ గంజాయి విక్రయిస్తోందనే సమాచారం మేరకు ఆమె ఇంట్లో ఎక్సైజ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. 1.25 కిలోల గంజాయి లభించడంతో షకీలాబీని విచారించగా, తన కూతురు నాందెడ్ నుంచి తీసుకు వచ్చినట్లు తెలిపింది. చిన్నచిన్న ప్యాకెట్లు చేసి తన అల్లుడు షేక్ వసీం ద్వారా నగరంలోని యువతకు విక్రయిస్తున్నామని ఒప్పుకుంది. దీంతో షకీలాబీతోపాటు ఆసామ్, వసీంను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దాడిలో ఎక్సైజ్ ఎస్సై మల్లేశ్, సిబ్బంది ప్రభాకర్, షబ్బీరుద్దీన్, సంగయ్య, ధార్‌సింగ్ పాల్గొన్నారు.

### పరిస్థితి విషమించి మహిళ మృతి

రామారెడ్డి: గడ్డి మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు సదాశివనగర్ ఎస్సై రాజు తెలిపారు. మృతురాలి కొడుకు ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి..

సదాశివనగర్ మండలం మర్కల్ గ్రామానికి చెందిన జోగిని పెద్దరాజయ్యతోపాటు ఇతరులు భూమి విషయంలో పల్లె మల్లవ్వ(55)ను ఇబ్బందులకు గురిచేశారు. దీంతో మనస్తాపానికి గురైన మల్లవ్వ ఈనెల 20వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమెను నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి కొడుకు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### మహిళ అదృశ్యం

కామారెడ్డి క్రైం: రామారెడ్డి మండలం పోసానిపేట గ్రామానికి చెందిన తెడ్డు అనిత అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం తెలిపారు. పసిరికల నివారణకోసం మందు తాగి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయల్దేరిన అనిత కామారెడ్డి కొత్త బస్టాండ్‌కు వచ్చిన తరువాత భర్తతో ఫోన్‌లో మాట్లాడిందని, ఆ తరువాత ఫోన్ ఎత్తడం లేదన్నారు. పలుచోట్ల వెతికినప్పటికీ అనిత ఆచూకీ లభించకపోవడంతో భర్త బాలయ్య ఫిర్యాదు చేశాడన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

### విద్యుత్ షాక్‌తో గేదె మృతి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని మంచిప్పలో కెతావత్ శ్రీనివాస్‌కు చెందిన గేదె విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. సోమవారం భారీ ఈదురుగాలులతో కూడిన వర్షాలకు ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగ తెగిపోయింది. మేతకు వెళ్లిన గేదె విద్యుత్‌తీగకు తగలడంతో షాక్‌తో మృతి చెందింది. సుమారు రూ.లక్షకుపైగా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు శ్రీనివాస్ కోరారు.



# రేవంత్‌రెడ్డివి పచ్చి అబద్ధాలు

- రుణమాఫీ చేయలేక ప్రమాణాలు సరికాదు
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



నిజామాబాద్‌లో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్‌నాగారం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని, రుణమాఫీ చేయలేక దేవుళ్ల మీద ప్రమాణాలు చేస్తున్నారని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలవుతున్నా ఏ ఒక్క పథకం అమలు కాలేదన్నారు. సీఎం మాటలను విని జనాలు నవ్వుతున్నారని, తన కొడుకులపై దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. రేవంత్‌రెడ్డి హోల్‌సేల్ వ్యాపారం చేస్తే ఆయన అన్నాదమ్ముళ్లు బ్రాంచీలు తెరిచారని ఎద్దేవా చేశారు. రాముడికి, రాజకీయాలకు సబంధం లేదన్నారు. బీజేపీ నాయకులు రావణాసురులవంటి వారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి, బీజేపీ కుమ్మక్కై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ముఖ్యమంత్రి ఉన్నకాలంలో ఎప్పుడూ కరెంట్ సమస్య రాలేదని, బీఆర్ఎస్‌ను ఓడించి తాము మోసపోయామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. రేవంత్ రెడ్డి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. అర్వింద్ బాండ్ పేపర్ ఇచ్చి మోసం చేశారని, సీఎం రేవంత్ రెడ్డివి చిల్లరమల్లర మాటలని మరో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి విమర్శించారు. సమావేశంలో నగర మేయర్ నీతూకిరణ్, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు సుజిత్‌సింగ్‌ఠాకూర్, సత్యప్రకాశ్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

# కవిత బాటలోనే అర్వింద్

- ఎంపీగా జిల్లాకు ఏమీ చేయలేదు
- కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్: ఐదు సంవత్సరాలు ఎంపీగా ఉండి జిల్లాకు ఏమీ చేయని కవితను ఎంపీ అర్వింద్ ఆదర్శంగా తీసుకోవడం సిగ్గుచేటని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి ఎద్దేవా చేశారు. కవిత, అర్వింద్ జిల్లాకు చేసిందేమీ లేదని, తనకు అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపుతానన్నారు. ఆర్మూర్ పట్టణంలోని పీవీఆర్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ అర్వింద్‌కు ఐదేళ్ల తరువాత రైతులు గుర్తుకొచ్చారా? అని ప్రశ్నించారు. అర్వింద్ నిర్లక్ష్యం కారణంగానే పసుపు బోర్డు, చక్కెర కర్మాగారం, ఆర్మూర్–ఆదిలాబాద్ రైల్వే లైన్, లక్కంపల్లి సెజ్ ముందుకు వెళ్లలేదన్నారు. రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకున్నట్లుగానే, దేశ ప్రజలు సైతం మార్పు కోరుకుంటున్నారన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని ధీమా వ్యక్తం చేశారు. తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసిందని తెలిపారు. రుణమాఫీ చేసి, ఖరీఫ్‌కు కొత్త రుణాలు ఇవ్వనున్నామన్నారు. ఎరువుల విషయంలో బీజేపీ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని ఆరోపించారు. రుణమాఫీ చేస్తే రైతులు సోమరిపోతులవుతారని అంటున్న బీజేపీ.. అంబానీ, అదానీలకు రుణమాఫీ చేస్తే వారు సోమరిపోతులు అవ్వరా అని ప్రశ్నించారు. అర్వింద్ ఏ హక్కుతో రైతులను ఓట్లు అడుగుతున్నారన్నారు. ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి, నాయకులు మార చంద్రమోహన్, పట్టణ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్, నాయకులు మారుతి రెడ్డి, అయ్యప్ప శ్రీనివాస్, మోత్కూర్ లింగాగౌడ్, జీవన్, సుంక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రామరాజ్య నిర్మాణానికి కృషి చేద్దాం

- కాంగ్రెస్ మేనిఫెస్టో హిందూ సమాజం భయపడే విధంగా ఉంది
- ఎంపీ, బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్





బోధన్‌లో మాట్లాడుతున్న ధర్మపురి అర్వింద్

బోధన్‌టౌన్(బోధన్): దేశంలో రామరాజ్య నిర్మాణానికి అందరూ కృషి చేయాలని. అయోధ్యలో శ్రీరాముని ఆలయ నిర్మాణానికి కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలు హిందువులను అణగదొక్కే విధంగా ఉన్నాయని, ఆ పార్టీ మేనిఫెస్టో హిందువులను భయభ్రాంతులకు గురి చేసేవిధంగా ఉందని విమర్శించారు. దేశ సంపదన దోచి ముస్లింలకు పంచి పెట్టే విధంగా వ్యవహరిస్తోందని, హిందూ సమాజాన్ని కాంగ్రెస్ లెక్క చేయడం లేదని ఆరోపించారు. దేశాన్ని 65 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ ఒరగబెట్టిందేమీ లేదన్నారు. దేశంలోని రైతులు, మహిళలను పట్టించుకోకుండా ముస్లింల ఆర్థిక స్థితిగతుల గురించే కాంగ్రెస్ ఆలోచిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మిషన్‌భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టుల అవినీతిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మోదీ పాలనలో భారతదేశం సుభిక్షంగా ఉందని, కాంగ్రెస్‌ను నమ్మి ఓటు వేస్తే మనల్ని నట్టేటా ముంచుతారని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డి మోహన్‌రెడ్డి, మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, బాన్సువాడ ప్రభారీ నర్సింహారెడ్డి, జిల్లా కార్యదర్శి సుధాకర్‌చారి, పట్టణ అధ్యక్షుడు కొలిపాక బాలరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీధర్, ఎడపల్లి, బోధ న్, సాలూర మండలాల అధ్యక్షులు ఇంద్రకరణ్, మనోహర్, ప్రవీణ్, నాయకుడు మేక సంతోష్ పాల్గొన్నారు.

### చిన్న పిల్లలను రాజకీయాల్లోకి లాగొద్దు

చిన్న పిల్లలను రాజకీయాల్లోకి లాగడం పద్ధతి కాదని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. రాజకీయాల్లోకి మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకును లాగడం కక్షపూరిత చర్య అని తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. గతంలో షకీల్ కొడుకుపై యాక్సిడెంట్ కేసు ఉందని, ఇటీవల జరిగిన కేసులో జైలుకు పంపి బయటకు వచ్చిన అనంతరం పాత కేసును తిరగదొడడం కక్ష సాధింపేనని అన్నారు. 20ఏళ్ల పిల్లాడిపై రాజకీయ దురుద్దేశాన్ని రుద్దడం మంచి పద్ధతికాదని, ఇది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. దమ్ముంటే మాజీ ఎమ్మెల్యే షకీల్‌ను తీసుకురావాలన్నారు.

# 'విజయ యాత్రకు' భారీ బందోబస్తు

ఖలీల్‌వాడి: హనుమాన్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వీర హనుమాన్ విజయయాత్రకు పోలీసులు భారీబందోబస్తు నిర్వహించారు. నీలకంఠేశ్వరాలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర శివాజీనగర్ చౌరస్తా వరకు కొనసాగింది. శోభాయాత్రకు ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్లు, హోంగార్డులు మొత్తం 600 మంది బందోబస్తు విధులు నిర్వర్తించారు. నిజామాబాద్, కామారెడ్డి, ములుగు, సిద్ధిపేట జిల్లాల పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. శోభాయాత్ర ప్రారంభం నుంచి ముగింపు వరకు పోలీసు కంట్రోల్‌రూమ్ నుంచి సీసీ టీవీల్లో బందోబస్తును పర్యవేక్షించారు. శోభాయాత్ర కొనసాగిన ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా సారించారు. నగరంలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్‌ను మళ్లించారు. హనుమాన్ శోభాయాత్ర ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.

# మే 1నుంచి వేసవి శిక్షణ తరగతులు

నిజామాబాద్ అర్బన్: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు శిక్షణ తరగతులు మే ఒకటి నుంచి ప్రారంభించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 13వ తేదీ వరకు తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండి పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఈ కోర్సులకు అర్హులని తెలిపారు. లోయర్ గ్రేడ్ టీటీసీ ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఈనెల 23 నుంచి దరఖాస్తులను విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

### కలప దుంగలు స్వాధీనం



అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న ఆటో

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని మంచిప్ప అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా కలప దుంగలు (ఇప్ప చెట్టు) తరలిస్తున్న ఆటోను అటవీశాఖ అధికారులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. ఇందల్వాయి ఎఫ్ఆర్‌వో రాధిక తెలిపిన వివరాల ప్రకారం.. అటవీశాఖ సెక్షన్, బీట్ అధికారులు మంచిప్ప గ్రామశివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. అదేసమయంలో కాల్పోల్‌కు చెందిన ఆటోలో కలప దుంగలు తరలిస్తుండగా అనుమానం వచ్చి అడ్డుకోగా, డ్రైవర్ ఆటోను ఆపకుండా వెళ్లిపోయాడు. అటవీశాఖ సిబ్బంది ఆటోను వెంబడించగా, బోర్గాం(పి)వద్ద ఆటోను వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. ఆటోలో ఉన్న సుమారు రూ.10వేల విలువైన కలప దుంగలతోపాటు ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఆటో యజమానికిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్‌వో రాధిక తెలిపారు. దాడిలో సెక్షన్, బీట్ ఆఫీసర్లు సాయికృష్ణ, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.